బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

నరేశ్(ఫైల్)

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 27: మండలంలోని హన్మంత్‌పల్లికి చెందిన తాళ్లపల్లి నరేశ్(38) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ మంగళవారం తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..నరేశ్‌కు పదేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలుగలేదు. రెండేళ్ల నుంచి 'నీ భార్యతో కలిసి దిగిన ఫొటోలు ఉన్నాయి.. వాటిని అందరికీ చూపిస్తాను' అని నరేశ్‌ను ఇంటి సమీపంలో ఉండే శాంతయ్య ఇబ్బందులకు గురి చేశాడు. పరువు పోతుందని మనస్తాపం చెందిన నరేశ్ ఈ నెల 26న ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి సాయంత్రమైనా తిరిగి రాలేదు. బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు గ్రామ శివారులో బావిలో నరేశ్ శవం కనిపించింది. శాంతయ్య వేధించడంతోనే తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి తాళ్లపల్లి పోశం ఫిర్యాదు మేరకు లక్షెట్టిపేట ఎస్సై-2 రామయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 27: మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన నిరుపేద కుటుంబానికి గవ్వల శ్రీకాంత్ మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. మాట్లాడుతూ మ్యాకల మహేశ్ కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. అతడి కుటుంబం దీన స్థితిని చూసి నిత్యావసర సరుకులను అందజేసినట్లు తెలిపాడు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అభిమానులు కుందారపు నారాయణ, టెక్కం తిరుపతి, బాబర్, వెంకటేశ్, శ్యామల, కార్తిక్, రమేశ్ తదితరులు ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభించాలని వినతి

జైపూర్, ఫిబ్రవరి 27: మండలంలోని ఇందారం వద్ద జాతీయ రహదారిపై హెచ్ కె ఆర్ రోడ్ వేస్ వారు ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించాలని ఆ కంపెనీ మేనేజర్ రామకృష్ణకు మంగళవారం స్థానిక నాయకులు వినతిపత్రం అందించారు. లైటింగ్ లేని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి లైటింగ్ ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరికె సంతోష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన టీసీసీ పరీక్షలు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 27 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, సినిమా వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రశాంతంగా జరిగిందని డీఈవో తెలిపారు.

విజ్ఞాన గనిగా మంచిర్యాల జిల్లా

- రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తున్న మంచిర్యాల సైన్స్ సెంటర్
- జాతీయ స్థాయిలో బహుమతులు సాధిస్తున్న విద్యార్థులు
- గ్రామీణ ప్రాంతాల్లో విజ్ఞానం పంచుతున్న జిజ్ఞాస సంచార ప్రయోగశాల
- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్

సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న డీఈవో యాదయ్య (ఫైల్)

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 27 : రామన్ ఎఫెక్ట్ డేను జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహిస్తారు. సీవీ రామన్ క్రాంతి వ్యాప్తీకరణ రహస్యాన్ని శోధించాడు. ఫలితంగా భౌతిక శాస్త్రంలో మొట్టమొదటి సారిగా నోబెల్ బహుమతి అందుకున్నాడు. రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణ రోజైన ఫిబ్రవరి 28న భారతదేశంలో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవంగా జరుపుకుంటారు. మంచిర్యాల జిల్లా ఏర్పడినప్పటి నుంచి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా బాల మేధావులను ప్రోత్సహించే విధంగా ఇన్‌స్పైర్ మనాక్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నారు. 2018, ఆగస్ట్ 9న అప్పటి కలెక్టర్ ఆర్‌వీ కర్ణణ్ ఆధ్వర్యంలో దేవాదాయ, న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మంచిర్యాలలోని జడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో జిల్లా సైన్స్ సెంటర్‌ను ప్రారంభించారు. 233 పాఠశాలల నుంచి 17,090 మంది విద్యార్థులు, 892 మంది ఉపాధ్యాయులు ఈ సైన్స్ కేంద్రం సేవలను వినియోగించుకున్నారు.

అధునాతన పరికరాలు...

హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్, వరంగల్‌లోని రీజినల్ సైన్స్ సెంటర్ తర్వాత మంచిర్యాలలో అధునాతన పరికరాలతో సైన్స్ సెంటర్ ప్రారంభమైంది. ఈ సైన్స్ సెంటర్‌లో రోజూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులు ప్రయోగాలు తెలుసుకుంటూ సైన్స్‌పై మక్కువ పెంచుకుంటున్నారు.

జిజ్ఞాస సంచార ప్రయోగశాల...

గతేడాది ఫిబ్రవరిలో జిజ్ఞాస సంచార ప్రయోగశాలను అప్పటి కలెక్టర్ భారతీ హోళికేరి ప్రారంభించారు. ఆ ఏడాది 15 పాఠశాలలు తిరిగి 600 మంది విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ జిజ్ఞాస సంచార ప్రయోగశాల ఇప్పటి వరకు 127 పాఠశాలల విద్యార్థులకు చేరువై 8,471 మంది విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచింది.

జాతీయ స్థాయిలో జిల్లా విద్యార్థుల ప్రతిభ...

జాతీయ సైన్స్ టెక్నాలజీ ఆధ్వర్యంలో యేటా నిర్వహించే ఇన్‌స్పైర్ పోటీలకు ఉమ్మడి జిల్లాలోనే మంచిర్యాల జిల్లా నుంచి అత్యధిక మంది విద్యార్థులు ఎంపికవుతున్నారు. జిల్లా సైన్స్ కేంద్రం ఏర్పడ్డ నాటి నుంచి విద్యార్థుల ఆవిష్కరణలు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేలా ప్రోత్సాహం లభిస్తుండడంతో యేటా జాతీయ స్థాయి విజ్ఞాన మేళాలో విద్యార్థులు సత్తా చాటుతున్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ. 10 వేలు ప్రోత్సాహకంగా అందిస్తున్నారు.

పుస్తకంలో జిల్లా విజయగాథ రావడం అభినందనీయం..

మినిస్ట్రీ ఆఫ్ మైన్స్, భారత ప్రభుత్వం ఎక్స్, ఫేస్‌బుక్, యూ ట్యూబ్, ఇన్‌స్టాగ్రాం, ఖో, థ్రెడ్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో జిల్లా విజయగాథను ప్రచురించడం అభినందనీయం. మధ్యప్రదేశ్ బోపాల్‌లో జరిగిన రెండవ మైనింగ్ మినిస్టర్ కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్ టేబుల్ బుక్‌లో ప్రచురించబడ్డాయి. గనుల మంత్రిత్వ శాఖ ప్రచురించిన కాపీ టేబుల్ పుస్తకంలో తెలంగాణ నుంచి మన జిల్లా సైన్స్ సెంటర్‌ని ఎంపిక ప్రచురించడం సంతోషదాయకం. మున్ముందు మరెన్నో సైన్స్ విజయాలు విద్యార్థులు సాధించాలి

-యాదయ్య, డీఈవో మంచిర్యాల

ఆరోగ్య సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలి

- హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్

మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 27: ఆరోగ్య సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో మహిళా సంఘాల సభ్యులు కీలక పాత్ర పోషించాలని హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మంచిర్యాల మున్సిపాలిటీ కార్యాలయంలోని మెప్మా హాలులో మహిళా సంఘాల ఆఫీస్ బేరర్లతో సమావేశం నిర్వహించారు. బోధకాలు వ్యాధి నిర్ధారణ కోసం రాత్రి పూట రక్తపూతల సేకరణ, ఆరోగ్య మహిళా క్లినిక్‌ల నిర్వహణ, తెలంగాణ డయాగ్నోస్టిక్స్ (టీహబ్) ద్వారా అందుతున్న సేవలు, ప్రభుత్వ దవాఖానాల్లో జరిగే కాన్పుల ద్వారా జరిగే మేలు, గర్భిణుల సత్వర నమోదు, తదితర అంశాలపై ఆయన మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. మార్చి 3న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామ్మూర్తి, మెప్మా కో ఆర్డినేటర్ చంద్రయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సరోజ, సుజాత, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయ వంతం చేయాలి

మందమర్రి, ఫిబ్రవరి 27: వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు మందమర్రి మండలంలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్, వైద్యాధికారి రమేశ్ సిబ్బందికి సూచించారు. మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో ప్రభుత్వ దవాఖానలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఐదేళ్ల లోపు గల పిల్లలు 5997 మంది ఉన్నారని, వీరందరికీ పోలియో చుక్కలు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ బీరయ్య, మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల కమిషనర్లు వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, డాక్టర్ మానస, సీహెచ్‌వో గంగాధర్, సీవో సురేఖ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు

జన్నారం, ఫిబ్రవరి 27 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 70 రోజులు గడచినప్పటికీ గ్రామ పంచాయతీలకు నిధులను విడుదల చేయకపోవడం దురదృష్టకరమని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు ఎద్దేవా చేశారు. బుధవారం మండల కేంద్రంలో పొనకల్ పంచాయతీలోని గూళ్లగూడెం వెళ్లే దారిలో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ సర్కారును విమర్శించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు గ్రామ పంచాయతీలకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఉచితంగా 5కిలో బియ్యాన్ని ఇస్తున్నపటికీ చౌక ధరల దుకాణాల వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటోను ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన యాత్రను కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. అనంతరం బాదంపెల్లి, ధర్మారం, చింతగూడ గ్రామాల్లో ఈజీఎస్ నిధులు రూ.50లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోళి చెందు, ముడుగు ప్రవీణ్, గుండవరపు మధుసూదన్‌రావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోటపల్లి, ఫిబ్రవరి 27 : కోటపల్లి, ఆలుగామ, దేవులవాడ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. కిష్టంపేట నుంచి కోటపల్లికి వచ్చే 33 కేవీ లైన్ మరమ్మతుల దృష్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వివరించారు.

వేమనపల్లి మండలంలో..

వేమనపల్లి, ఫిబ్రవరి 27 : మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దీక్షిత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీల్వాయి, మామడ, కల్మలపేట, కేతనపల్లి, ముల్కలపేట, రాచర్ల, గొర్లపల్లి, జాజులపేట, ముక్కిడిగూడెం, కల్లంపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్

పోలీస్ వాహనాలను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 27: సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పరిశోధనతో సమగ్ర విచారణ చేపట్టి తగిన సాక్ష్యాధారాలతో నేరస్తులకు శిక్ష పడేవిధంగా కృషి చేయాలని పోలీసు అధికారులకు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని డీసీపీ, ఏసీపీ, సీఐలు, ఎస్‌హెచ్‌వోలతో కమిషనరేట్‌లో పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, ఎస్సీ, ఎస్సీ అట్రాసిటి కేసులు, విచారణ, సాక్ష్యాధారాల సేకరణ, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. అనంతరం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి మంచిర్యాల జోన్‌లో పోలీస్ స్టేషన్ల పరిధిలో గల పోలీస్ వాహనాలు తనిఖీ చేశారు. వాటి నిర్వహణపై అధికారులు, డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

గాంధీ విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేయాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 27 : సిద్దిపేట మండలం బక్రీచెప్పాలలో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేయాలని ఆర్య వైశ్య మహా సభ జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. వెంటనే నిందితులను గుర్తించి శిక్షించాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వేమనపల్లి,ఫిబ్రవరి 27 : వేమనపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం నీల్వాయి ఎంపీటీసీ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీడీఎఫ్ నిధులతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ ఆలీ, మాజీ సర్పంచ్‌లు గాలి మధు, తోకల రాంచంద్రం, కో ఆప్షన్ సభ్యుడు ముజ్జు, శేఖర్, సమ్మయ్య, నగేశ్, సంతోష్, శంకరి, నాగేందర్, మధు, చందు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు. వేమనపల్లిలోని ఉన్నత పాఠశాలను మంగళవారం నీల్వాయి ఎంపీటీసీ ఆర్. సంతోష్‌కుమార్ సందర్శించారు. పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు మూత్రశాలలు అవసరం అని తెలియజేయగా, ఎమ్మెల్యే వినోద్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానని ఎంపీటీసీ తెలిపారు.

వేలం పాట

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 27: శివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని కత్తెరశాల గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయం వద్ద మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో దుకాణాల సముదాయాల ఏర్పాటుకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. కొబ్బరికాయలు విక్రయానికి రూ. 1, 11,000. లడ్డూ ప్రసాదం, పులిహోరకు రూ. 1,10,000. నూనె విక్రయ దుకాణాలకు రూ. 3 వేలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రవి తెలిపారు. బోనం చెల్లింపు వేలాన్ని మార్చి 2న నిర్వహిస్తామని ఈవో రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కత్తెరశాల గ్రామస్తులు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వరి చేల పరిశీలన

కోటపల్లి, ఫిబ్రవరి 27 : కోటపల్లి మండలంలోని బోరంపల్లి గ్రామం సమీపంలో సాగు చేస్తున్న వరి చేలను కోటపల్లి మండల ఏవో మహేందర్, ఏఈవో శేఖర్‌లు సందర్శించారు. వరి పంటలో పీక పురుగు నివారణ చర్యలు, తెగుళ్ల నివారణపై సూచనలు చేశారు.

మోటివేషనల్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా తిరుపతి

హాజీపూర్, ఫిబ్రవరి 27 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో గ్రామీణ వైద్యుడు తిరుపతి ఎగుడ మోటివేషనల్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా సోమవారం అర్హత పత్రాన్ని అందుకున్నారు. సికింద్రాబాద్‌లోని మినర్వా గ్రాండ్ త్రీ స్టార్ హోటల్‌లో జరిగిన ఆఫ్ లైన్ శిక్షణ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచి రిటైర్డ్ ప్రొఫెసర్ విశ్వనాథం, ఇంపాక్ట్ ప్రతినిధుల చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

స్టేట్ సెక్రటరీగా తిరుపతి

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 27: ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన పెరుగు తిరుపతిని నియమించారు. ఈ నెల 26న హైదరాబాద్‌లోని సోమాజీగూడా ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక ముఖ్య కార్యకర్తల సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు గుడిసె దేవానంద్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. రెండవ సారి పదవి అప్పగించినందుకు జాతీయ అధ్యక్షుడితో పాటు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను, ఉపాధ్యక్షుడు జగదీశ్‌కుమార్, ప్రధానకార్యదర్శి ముంజగర్ల విజయ్‌కుమార్‌కు తిరుపతి కృతజ్ఞతలు తెలిపాడు.

చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి

మందమర్రి, ఫిబ్రవరి 27: స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని మంగళవారం సింగరేణి ఎస్ అండ్ పీసీ ఉద్యోగి, రిటైర్డ్ సైనికుడు రాజేశ్ పిహ్వాల్ ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాణి పిహ్వాల్, హెచ్ఎం పురుషోత్తం, ఉపాధ్యాయులు రవీందర్, శ్రీనివాస్‌రావు, రవిరాజు, ప్రసాద్‌రావు, శ్రీనివాస్ తదితరులున్నారు.

కన్నెపల్లి, ఫిబ్రవరి 27 : కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లిలో మంగళవారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్, నరేశ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు

విద్యా సామగ్రి పంపిణీ

కోటపల్లి, ఫిబ్రవరి 27 : కోటపల్లి మండలం పారుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇన్స్పోసిస్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగ్స్, డ్రాయింగ్ కిట్స్, స్కిప్పింగ్ రోప్స్ అందజేశారు. ఇన్స్పోసిస్‌లో ఉద్యోగులుగా దుద్దిళ్ల సాయికృష్ణ, ముత్యపు వంశీ సహకారంతో పాఠశాలకు విద్యా సామగ్రి మంజూరు కాగా పాఠశాల హెచ్ఎం వసంత కుమారి, పూర్వ హెచ్ఎం దుద్దిళ్ల శంకర్ రావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ హెచ్ఎం దుద్దిళ్ల శంకర్‌రావ్, అతని కుమారుడు దుద్దిళ్ల సాయికృష్ణ, మరో ఉద్యోగి వంశీకి విద్యార్థు లు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

బెల్లంపల్లి డిగ్రీ కళాశాలలో..

బెల్లంపల్లి, ఫిబ్రవరి 27: ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ విద్యార్థులకు మంగళవారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం లెక్చరర్ గజెల్లి మోహన్ ఆధ్వర్యంలో తయారు చేసిన బీఏ తృతీయ సంవత్సరం మెటీరియల్‌ను ప్రిన్సిపాల్ టీఎస్ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. అధ్యాపకులను ప్రిన్సిపాల్ అభినందించారు.

చెన్నూర్‌లో సినిమా ఆడిషన్స్

చెన్నూర్ టౌన్, ఫిబ్రవరి 27 : చెన్నూర్ లోని జైహింద్ ఆఫీసర్స్ క్లబ్‌లో 'కోటపల్లి పోలీస్ స్టేషన్' సినిమా ఆడిషన్స్ మంగళవారం నిర్వహించారు. శ్రీలక్ష్మీ నారాయణ ఆర్ట్స్ బ్యానర్‌పై దీవెన ఇంటర్నేషనల్ మూవీ ప్రొడక్షన్స్, మంచిర్యాల మూవీ ఆర్టిస్ట్, యూట్యూబ్ అసోసియేషన్ సమర్పణలో ఈ సినిమా ప్రారంభిస్తున్నట్లు ప్రముఖ దర్శకుడు కే.తిరుపతి వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు కల్లెపల్లి సునీత కృపానందం, తోట మహేశ్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కే.తిరుపతి వర్మ, సినిమాటోగ్రఫీ విజయ్ కుమార్ దుర్గం, మాటలు అల్లాడి శ్రీనివాస్ నటీనటులు మహేశ్, సందీప్, జోయల్, జయశ్రీ, అపర్ణ, కావ్య, మీసినేని రాజన్న, తిరుపతి గౌడ్, కలీం, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్ : మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి యాదయ్య

పరీక్షలంటే భయం వీడాలి

- డీఈవో యాదయ్య

చెన్నూర్, ఫిబ్రవరి 27: పరీక్షలంటే భయం వీడాలని విద్యార్థులకు డీఈవో యాదయ్య సూచించారు. చెన్నూర్‌లోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ప్రేరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చెన్నూర్, కోటపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సును నిర్వహించారు. పక్కా ప్రణాళికతో సిద్ధమైతే వంద శాతం ఫలితాలతో పాటు అత్యుత్తమ జీపీఏ సాధించగలుగుతామని తెలిపారు. ఈ సదస్సులో ప్రముఖ సైకాలజిస్ట్ భాస్కర్ సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ గంగాధర్, ఎంపీడీవో మోహన్, ఎంఈవో కే రాధాకృష్ణమూర్తి, విద్యాశాఖ కో-ఆర్డినేటర్ చౌదరి, ఎంపీవో అజ్మత్ అలీ, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, పలు ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులున్నారు.

చెన్నూర్ : సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

జైపూర్, ఫిబ్రవరి 27: ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు జయకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, హెచ్ఎం బాలభాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

తాండూర్, ఫిబ్రవరి 27 : పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంపీడీవో పీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు తాండూర్‌లోని సురభి గోదా క్షేత్ర గార్డెన్స్‌లో మంగళవారం ప్రముఖ సైకాలాజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ శ్రావణ్‌కుమార్‌తో ప్రేరణ, మోటివేషన్ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో, ముఖ్యఅతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మోటివేటర్ శ్రావణ్‌కుమార్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి మూర్తి, ఎంపీవో సత్యనారాయణ, మండల నోడల్ ఆఫీసర్ ఎస్ మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, జయప్రకాశ్, ప్రదీప్, కేజీబీవీ ఎస్‌వో సుమన చైతన్య, సీఆర్పీ తిరుపతి, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 18 నుంచి టెన్త్ పరీక్షలు

నస్పూర్, ఫిబ్రవరి 27 : మార్చి18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పరీక్షల కోసం 52 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సింగరేణి

ప్రమాదంలో గాయపడ్డ కార్మికుడి మృతి

ఆహ్మద్ పాషా(ఫైల్)

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 27 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ -3 గనికి చెందిన అహ్మద్ పాషా సపోర్ట్‌మెన్ కార్మికుడు ఈ నెల 24న రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ నెల 24న శనివారం బొక్కల గుట్టవద్ద తన మోటర్ సైకిల్‌పై వస్తుండగా ప్రమాదానికి గురై తలకు, లంగ్స్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మూడు రోజులుగా కరీంనగర్ అపోలో రీచ్‌లో చికిత్స పొందుతున్న అహ్మద్ పాషా మంగళవారం ఉదయం మృతి చెందారని ఎస్సార్పీ-3 వెల్ఫేర్ ఆఫీసర్ గౌస్‌పాషా పేర్కొన్నారు. అహ్మద్ పాషా బెల్లంపల్లి హన్మాన్ బస్తీలో నివాసం ఉండగా, ఎస్ఆర్పీ 3గనిలో విధులు నిర్వర్తిస్తున్నారు. కార్మికుడికి భార్య ఫరీన్ సుల్తానా, తండ్రి దాదన్, తల్లి దుర్దానా బేగం, కొడుకు షేక్ రవాయిడ్ ఉన్నారు. మృతి చెందిన అహ్మద్ పాషా భౌతిక కాయాన్ని మంగళవారం మంచిర్యాల దవాఖానలో ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు, కుమారస్వామి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, పిట్ కార్యదర్శి శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

ఆర్కేపీ ఓసీ